క్లుప్తంగా

ప్రజలకు దసరా శుభాకాంక్షలు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక దంపతులు



చిలమత్తూరు: హిందూపురం నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు దీపిక వేణురెడ్డి దంపతులు బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయుధపూజ నిర్వహించారు. జగన్నాథ ఆశీర్వాదంతో రైతులు, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవనం సాగించాలని ఆకాంక్షించారు.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం



నూతన ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

మడకశిర: పట్టణంలోని 4వ వార్డు ప్రాథమికోన్నత పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఇటీవల డీఎస్సీలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. నియోజకవర్గంలో దాదాపు 95 మంది ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈసందర్భంగా యూటీఎఫ్ నాయకులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న, యూటీఎఫ్ నాయకులు మాలింగప్ప, జోగప్ప, మూడ్ల గిరియప్ప, కదురప్ప, గిరిజమ్మ, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేస్తున్నాం



స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

రొద్దం: ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ, జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. బుధవారం మండలంలోని చెరుకూరులో మంత్రి పర్యటించారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయశంకర్‌రాజు, ఎంపీడీఓ ఆనంద్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక తయారీపై గ్రామ సభలు

అమరాపురం: మండలంలోని 11 పంచాయతీ గ్రామాల్లో ఈ నెల 3, 4 తేదీల్లో ఆయా పంచాయతీ కేంద్రాల్లో 2026 – 27 ఆర్థిక సంవత్సరానికి మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద కొత్త పనులను ఎంపిక చేయడానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామారావు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, ఉపాధి కూలీలు, రైతులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

కోరిన కోర్కెలు తీర్చే దైవం వీరభద్రుడు

- 4న అగ్నిగుండ మహోత్సవం, 5న రథోత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ

అగళి: మండలంలోని మధూడిలో వెలసిన వీరభద్రస్వామి కోరిన కోర్కెలు తీర్చేదైవంగా పూజలందుకుంటున్నారు. నవరాత్రి వేళ రోజుకో రూపంలో స్వామి వారిని భక్తులు దర్శనం ఇస్తారు. ఈ నేపథ్యంలోనే ప్రతి ఏడాది అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే అగ్ని గుండం మహోత్సవాన్ని 4వ తేదీ నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే 5వ తేదీన స్వామి వారి రథోత్సవాన్ని నిర్వహించనున్నారు.

చోళుల కాలంలో విగ్రహ ప్రతిష్ట

క్రీ.శ 1000 నుంచి 1300 వరకూ సాగిన చోళుల పరిపాలనలో దక్షిణ భారతదేశంలో ఎన్నోచోట్ల శివునికి సంబంధించిన ఆలయాలను ఎక్కువగా నిర్మించారు. మండల పరిధిలోని మధూడిలో వెలసిన వీరభద్రస్వామి క్షేత్రం కూడా అందులో ఒకటి. అప్పట్లో అధిక వర్షాలతో హేమేవతి అనే ప్రదేశంలో తేలిన విగ్రహమే వీరభద్రస్వామిదిగా గ్రామ పెద్దలు చెబుతున్నారు. ఆ విగ్రహ మూర్తిని మధూడిలోని చెరువు చివర చోళులు ప్రతిష్ఠించారని తెలుస్తోంది. స్వామి రౌద్రవతారంలో అందమైన ముఖారావింతో భక్తుల కోరికలను నెరవేరుస్తూ పూజలు అందుకుంటున్నారు. స్థానికులు ఏ పనిమీద బయటకు వెళ్లినా స్వామివారిని దర్శించుకుని వెళ్లడం పరిపాటిగా మారింది.



అలంకరణలో వీరభద్రస్వామి



వీరభద్రస్వామి ఆలయం

వేలాదిగా తరలిరానున్న భక్తులు

అగ్నిగుండం మహోత్సవానికి మన రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు వేలాదిగా తరలిరానున్నారు. ఆ రోజు అగ్నిగుండంలో దూపాన్ని వేసి మొక్కులు చెల్లించుకొన్నున్నారు. ఇలా చేయడం వల్ల కష్టాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన లింగదవీరప్పస్వాములు నృత్యంతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన ఈరలక్కప్ప



తిరుపతిలో మిథున్‌రెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలో బుధవారం మడకశిర వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప కలిశారు. అక్రమ లిక్కర్ స్కాం కేసులో మిథున్‌రెడ్డి అరెస్ట్ అయి ఇటీవలనే బెయిల్‌పై విడుదలైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈరలక్కప్ప మర్యాద పూర్వకంగా కలిశారు. మడకశిర నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని ఆయన అడిగి తెలుసుకున్నట్లు ఈరలక్కప్ప 'సాక్షి'కి తెలిపారు. పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని సూచించారన్నారు.

ఘనంగా ఆయుధ పూజ



హిందూపురం: వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఆయుధ పూజ చేసిన దృశ్యం

హిందూపురం: దసరా పండగ సందర్భంగా హిందూపురం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో సీఐ రాజగోపాల్‌నాయుడు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా ఆయుధపూజ నిర్వహించారు. పోలీసుస్టేషన్‌ను సుందరంగా అలంకరించారు. ఆయుధాలు, దేవి చిత్రపటం ఏర్పాటు చేసి పూజలు చేశారు.

అమరాపురం: మండలంలో ఆయుధ పూజను బుధవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. రైతులు తమ ఇంట్లో ఉన్న నాగలి, కొడవలి, గొడ్డలి, మడ్లగొర్రు, దుకాణాల్లో వ్యాపారస్తులు వివిధ రకాల వస్తువులకు పూజలు చేశారు.

పెనుకొండ: ఆయుధాల పూజను పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వాహనాల యజమానులు, డ్రైవర్లు కార్లను, లారీలు, టిప్పర్లు, ద్విచక్ర వాహనాలను అందంగా ముస్తాబు చేసి పూజలు చేశారు. ప్రధానంగా పులేటమ్మ ఆలయం వద్ద వాహనాలు బారులు తీరాయి. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయుధాల పూజ జరుపుకున్నారు.

పావగడ: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ వాహనాలను పూలతో అలంకరించి బూడిద గుమ్మడి కాయలతో దిష్టి తీసి ఆయుధాల పూజ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని ప్రధాన రహదారిలో వాహనాల ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ సుదేశ్ కుమార్, ముఖ్యాధికారి జాఫర్ షరీఫ్, ఆరోగ్యాధికారి షంషా తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు రక్షణగా 'డిజిటల్ బుక్'



డిజిటల్ బుక్ స్కానర్‌ను ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త టీఎన్ దీపిక, పార్టీ శ్రేణులు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కార్యకర్తలకు రక్షణగా డిజిటల్ బుక్ అందుబాటులోకి తీసుకువచ్చారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుమతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, పార్టీ నేతలతో కలిసి ఆమె డిజిటల్ బుక్ ఆవిష్కరించారు. అనంతరం దీపిక మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ పరిపాలన సాగిస్తూ కూటమి నాయకులు అరాచకాలను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. వాళ్లు హింసను ప్రేరేపిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ రాక్షసక్రీడ అమలు చేస్తున్నారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా వారు చేస్తున్న దశ్యలను డిజిటల్ బుక్ సమాధానం చెబుతుందన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త డిజిటల్ బుక్‌లో టీడీపీ నేతలు చేసే దాడులు, కక్ష సాధింపు చర్యలను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వేణురెడ్డి, బాలాజీ మనోహర్, నాగరాజు, మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శులు అన్వర్ అహ్మద్, బూత్ కమిటీ జిల్లా అధ్యక్షుడు వాల్మీకి లోకేష్, అమానుల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అసిఫుల్లా, వైఎస్సార్‌సీపీ చిలమత్తూరు, హిందూపురం మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, రాము, కౌన్సిలర్ షాజియా, రోషన్ అలీ, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు కవితారెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మోహన్, బీసీ సెల్ అధ్యక్షుడు రామాంజినేయులు, నవీన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నాగభూషణరెడ్డి, శంకర్‌రెడ్డి, విష్ణురెడ్డి, ఆదర్శరెడ్డి, ప్రణయ్‌రెడ్డి, నరసింహ, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మడకశిర: శాకంబరిగా మారెమ్మ | లేపాక్షి: మహిషాసుర మర్దినిగా దుర్గాదేవి | అలంకరణలో చౌళసముద్రం చౌడేశ్వరీదేవి | హిందూపురం: కొల్హాపూర మహాలక్ష్మీదేవి

జయ జయహే మహిషాసురమర్దిని

సాక్షినెట్‌వర్క్: శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాలన్నీ బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. ఆయా ప్రాంతాల్లోని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.



రొద్దం: మహిషాసుర మర్దినిగా రేణుకా యల్లమ్మ | పెనుకొండ: మహిషాసురమర్దినిగా మహేశ్వరీదేవి | పరిగి: అలంకరణలో బాలాచౌడేశ్వరీదేవి | గోరంట్ల: మహిషాసుర మర్దినిగా చౌడేశ్వరీదేవి

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన



అగళిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

రొళ్ల: మండలంలోని ఎం.రాయపురం పంచాయతీ సోమఘట్టలో బుధవారం మండల వ్యవసాయశాఖాధికారి వెంకటరాముడు ఆధ్వర్యంలో జీఎస్టీ తగ్గింపుపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ ట్రాక్టర్‌తో పాటు ఇతరాత్ర వ్యవసాయ యంత్రీకరణ పరికరాలపై 18 నుంచి 5 శాతం మాత్రమే జీఎస్టీ ఉంటుందన్నారు. వీహెచ్ఏ అనిల్‌కుమార్, సచివాలయం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అగళి: జీఎస్టీ పన్నులు తగ్గింపుపై మండల కేంద్రంలో బుధవారం అధికారులు, నాయకులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి నాగరాజు మాట్లాడుతూ ట్రాక్టర్ విడి భాగాలపై ఉన్న 18 జీఎస్టీ 5 శాతానికి తగ్గించినట్లు పేర్కొన్నారు. 837 వస్తువుల ఐంతకు ముందు కంటే తక్కువ ధరలకు లభిస్తున్నాయని వెల్లడించారు. జీఎస్టీ తగ్గింపుతో సన్నచిన్న కారు రైతులకు భారీ ఊరట లభించిందన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, తహసీల్దార్ సుబ్బారావు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, వ్యవసాయ అధికారి నాగరాజు, జెడ్పీటీసీ ఉమేష్ పాల్గొన్నారు.

దసరా సందడి



మడకశిర రూరల్: మార్కెట్‌లో పూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

మడకశిరరూరల్: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో దసరా శోభ సంతరించుకుంది. ఆయా ప్రాంతాల్లోని మార్కెట్లు కిటకిటలాడాయి. పూలు, పండ్లు, ఇతర నిత్యావసరాల కొనుగోళ్లు ప్రజలు తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది.

కార్మికులకు దుస్తుల పంపిణీ

మడకశిరరూరల్: విజయదశమి సందర్భంగా 3వ వార్డు కౌన్సిలర్ లక్ష్మయ్య బుధవారం సాయంత్రం తన ఇంటి వద్ద మున్సిపాలిటీ కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వార్డులను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు నాగరాజు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

రొద్దం: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని పెనుకొండ సీఐ రాఘవన్ అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని గొరాజుపల్లిలో సీఐ రాఘవన్, ఎస్ఐ నరేంద్ర పల్లె నిద్ర చేపట్టారు. సీఐ మాట్లాడుతూ గ్రామంలో ఇటీవల నెలకొన్న సమస్యను గ్రామస్తులతో చర్చించి, చట్టం ప్రకారం అవగాహన కల్పించారు. సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరించుకోవాలని సూచించారు. ఎవరైనా ప్రభుత్వ భూమిలోకి ఆక్రమంగా ప్రవేశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో సమస్యగా మారిన ప్రభుత్వ స్థలం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.



మాట్లాడుతున్న సీఐ రాఘవన్

వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

మడకశిర: స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు నియోజకవర్గంలోని పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను బుధవారం పట్టణంలో పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని హిందూపురం రోడ్డులోని లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. తర్వాత చందకచర్లలో గంగమ్మ ఆలయంలో జరిగిన చండీ హోమంలో పాల్గొన్నారు.

గో పరిరక్షణకు చర్యలు తీసుకోండి

హిందూపురం: జిల్లా వ్యాప్తంగా చాలాప్రాంతాల్లో గోవధ, రవాణాలను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని ఎస్పీ సతీష్‌కుమార్‌ను వీహెచ్‌పీ నాయకులు చారుకోరి, అక్షయపాత్ర ఫౌండర్ రామాంజినేయులు కోరారు. ఎస్పీ బుధవారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు వచ్చిన సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిశారు.

6న మండల మీట్

మడకశిర: మడకశిర మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 6న ఉదయం 10.30 గంటలకు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సోబియా తెలిపారు. ఎంపీపీ కవిత అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

నిత్యావసరాల పంపిణీ

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని 24 వ వార్డు కౌన్సిలర్ వెంకటనారాయణ ఆధ్వర్యంలో వార్డుకు సంబంధించిన పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులను బుధవారం పంపిణీ చేశారు. వార్డు ఇన్చార్జ్ నాగేంద్ర, సుధాకర్, రవి, నాగరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం, మాంసం దుకాణాలు మూసేయండి

మడకశిర/పెనుకొండ: మడకశిర మున్సిపాలిటీ, పెనుకొండ నగర పంచాయతీ పరిధిలో వ్యాపారులు గురువారం మద్యం, మాంసం దుకాణాలను తెరవ కూడదని కమిషనర్లు జగన్నాథ్, సతీష్‌కుమార్ వేర్వేరు ప్రకటనల్లో సూచించారు. గాంధీ జయంతి సందర్భంగా దుకాణాలు మూసేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు అమ్మాజీ జాతర మహోత్సవం

రొళ్ల: మండల పరిధిలోని జీరిగేపల్లిలో వెలసిన అమ్మాజీ జాతర మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు అమ్మాజీ ధర్మ ప్రచార సేవ పరిషత్ ట్రస్ట్ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు మారన్న, ముదుపన్న తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రూ.3 లక్షల రికవరీకి ఆదేశం

గుడిబండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక సభను నిర్వహించారు. ఏడాది కాలంలో రూ.11.71 కోట్లు ఖర్చు పెట్టారా రూ.3లక్షల అవినీతి జరిగినట్లు అధికారులు తెలిపారు. ఆ మొత్తాన్ని రికవరీకి ఆదేశించారు. ఎంపీడీఓ కేశవరెడ్డి, ఏపీవో లోకేష్, ఏపీడీ శివానందనాయక్, ఎస్ఆర్పీ భాస్కర్, ఏపీఓ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక పింఛన్ల పంపిణీ

అమరాపురం: మండలంలోని 11 గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం సచివాలయం సిబ్బంది ద్వారా సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామారావు పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. సక్రమంగా అర్హులకు పింఛన్లు ఇస్తున్నారా? లేదా? ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. ఆదేరెడిండా బుధవారం సాయంత్రానికి 90 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ రామారావు తెలిపారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయండి

పెనుకొండ: పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు మంత్రి సవితకు బుధవారం వినతిపత్రం అందించారు. పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రిని కలిసిన ఏపీటీఎఫ్ నాయకులు డీఏలను వెంటనే విడుదల చేయాలని, 15 నెలలు గడిచినా ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించలేదన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, చంద్ర, గోపాల్, వెంకటరమణనాయక్, చంద్రమౌళి, శివణ్ణ, గణేష్, రఘునాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌పీ షాపు తనిఖీ

గుడిబండ: మండల పరిధిలోని దిగతూర్పి ఎఫ్‌పీ షాపును బుధవారం తహసీల్దార్ శ్రీధర్ తనిఖీ చేశారు. స్టాక్ నిల్వతో పాటు ఇతరాత్ర వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొత్తగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయాలని సూచించారు.







